VICTORY

విక్టరీ

# శ్రీ వామన మహాపురాణం

(వచనం)



శ్రీ వేదవ్యాస మహర్షి కృతము

# శ్రీ వామన మహాపురాణము

(వచనం)

## వేదవ్యాస మహర్షికృతం

అనుసరణ

**ఆవంచ సత్యనారయణ**

వెల : రూ. **300/-**

**విక్టరీ పబ్లిషర్స్**

డోర్. నెం. 30-17-3ఎ, వారణాశివారి వీధి, సీతారాంపురం,
విజయవాడ- 520 002. ఫోన్ : 0866 - 2444156.

# శ్రీ వామన మహాపురాణ విశేషాలు

**శ్రీ** మహావిష్ణువు యొక్క ఐదవ అవతారం వామనావతారం. ఆ అవతార మూర్తి పేరుతో వెలసినదే వామన పురాణం. పరబ్రహ్మం అనబడే పరమాత్మ నిర్గుణం అని వేదాంత వేద్యుల ఉక్తి. సగుణ రూపంలో ఆ పరబ్రహ్మను కనిపెట్టి జీవుడు ఉపాసిస్తున్నాడు. బ్రహ్మంయొక్క సగుణ రూపాలు శివ విష్ణు రూపాలు. వీటిల్లో విష్ణువును జీవునికి రక్షకునిగా భావించడం జరిగింది. ఈ రక్షణ అనే ప్రక్రియలో ఆయన తన అసలు స్వరూపంలో కాక వేరొక రూపంలో అవతారం ఎత్తి, భూమిపై దిగివచ్చి భక్తుల కష్టాలను కడతేర్చి, వారికి ముక్తిని కలిగిస్తాడు. ఈ రక్షణ ప్రక్రియలో ఆయన రాక్షసులను వధించటం జరుగవచ్చు. దుర్మార్గులను తగిన విధంగా శిక్షించవచ్చు. అయితే అవతార ముఖ్య ఉద్దేశ్యం కేవలం రాక్షసులను వధించడమే కాదు. ఈ దుఃఖ భాజనమైన సంసార జంజాటం నుండి జీవునికి విముక్తి కలిగించి ఆనందమయ ముక్తిని పొందే విధానం నేర్పటమే భగవంతుడు అవతారం ధరించటంలోని పరమార్థం అని భాగవతం (మర్త్యావతారం ఖలు మర్త్య శిక్షణం రక్షోవధాయైవ కేవలం విభోః – 5.1.–5) తెలుపుతున్నది. అందువలన విష్ణువు ఎత్తిన అవతారాలను తెలిపే పురాణాలే వామన, కూర్మ, వరాహ, మత్స్యపురాణాలు. వీటిల్లో వామన పురాణం అష్టాదశ పురాణాల్లో 14వ స్థానం ఆక్రమిస్తుంది.

## వామనపురాణం

వామనపురాణం అనే దాని పేరును బట్టీ మహావిష్ణువు వామనావతారాన్ని ధరించ వలసిన అవసరాన్ని, వృత్తాంతాన్ని వివరించిన పురాణం కాబట్టి ఇది వామన పురాణం అయింది. అలాగే ఆ మహావిష్ణువు ధరించిన ఆకారం లాగానే ఇది చిన్నపురాణం. ఇది కాక కూర్మ, మత్స్య, వరాహ పురాణాలు విష్ణువు యొక్క అవతార నామాలతో వెలసిన పురాణాలే. కానీ వాటిల్లో ఆయా అవతారాల వృత్తాంతం అంత విపులంగా వివరించటం

జరగలేదు. కానీ ఈ పురాణం వామనావతారం గురించి వివరంగానూ, విపులంగానూ వివరి స్తుంది. 'త్వగస్య వామనం స్మృతం' అని. మహావిష్ణువు యొక్క చర్మంగా చెప్పబడింది ఈ పురాణం.

ఈ పురాణంలోని ప్రత్యేకత చక్కని కావ్యశైలి. పురాణం ప్రారంభంలోనే గ్రీష్మ, వర్ష, శరత్తులాంటి ఋతువులు చక్కగా వర్ణించబడ్డాయి. వర్షఋతువులో భార్య పార్వతితో శివుడు పడిన కష్టాలను హృదయంగమముగా తెల్పటం చాలా ఆకర్షణీయంగా వివరిస్తుంది ఈ పురాణం. అలాగే కథాఖ్యానాలలో కూడా ఇందులో కొంత దండి దశకుమార చరిత్ర బాణుని కాదంబరి పోకడలు కనిపిస్తాయి. ఇందులో నరనారాయణుల వృత్తాంతం, దుర్గాదేవి చరిత్ర, ప్రహ్లాదుడు శ్రీదాముడు మొదలైన మహాభక్తుల చరిత్రలు చాలా హృదయంగమంగా వివరించ బడ్డాయి. ఈ పురాణంలో బలిచక్రవర్తిని పాతాళలోకానికి పంపిన వామన చరిత్ర చక్కగా వివరించటమేకాక, ధుంధుడనే రాక్షసరాజు వృత్తాంతంతో ఇంకొక వామనావతార కథ కూడా చెప్పబడింది. కొన్ని సందర్భాలలో ఇందులోని శ్లోక ఛాయలు పోతన ప్రసిద్ధ పద్యాలు 'కంజాక్షునకు గాని కాయంబు కాయమే పవనగుంఫిత చర్మ భస్త్రిగాక' వంటి పద్యాలకు మూలమేమో అనిపిస్తాయి. అందువలన వామన పురాణాన్ని పోతన వామనావ తార ఘట్టం వ్రాసేటప్పుడు చదివి ఉండి ఉండాలని అనిపిస్తుంది. ఇందులో గజేంద్ర మోక్ష కథ చక్కగా వివరించబడింది. పేరునుబట్టి ఇది వైష్ణవ పురాణమే అయినా, శైవ శాక్త ధర్మాలు, ఆచారాలు చక్కగా స్థాపించబడ్డాయి. మొత్తం మీద ఏదైవాన్ని ఆరాధిస్తున్నా మని కాక ఏదో ఒక దైవాన్ని ఆరాధించడమే మానవుని కర్తవ్యమని తెలిపే పురాణం ఇది. సర్వధర్మాలు ఒకటే అని స్థాపించిన పురాణం ఈ వామనపురాణం.

## ఇందలి ముఖ్యాంశాలు

మొదట దేవర్షి నారదునికి పులస్త్యమహర్షి వామనావతార కథను వివరించాడు, తరువాత శివుని లీలా చరిత్రము ఆయన జీమూతవాహనుడైన వృత్తాంతము, బ్రహ్మ కపాలమును శివుడు ఖండించడం, కపాల మోచన ఆఖ్యానము, దక్షయజ్ఞ విధ్వంసము, హరియొక్క కాల రూపము, మన్మథ దహనము, ప్రహ్లాదునికి నారాయణునికి మధ్య జరిగిన ఘోర సంగ్రామము, భావనకోశము, దుర్గా చరిత్రము, కురుక్షేత్ర వర్ణనం. పార్వతీ జన్మము, గౌరీ ఆఖ్యానము, స్కందచరిత్రము, అంధక వధ, జాబాలి మహర్షి కథ, మరుద్గణాల ఉత్పత్తి, బలిచక్రవర్తి చరిత్రము, లక్ష్మీ చరిత్రము, ప్రేతోపాఖ్యానము, నక్షత్ర పురుషా ఖ్యానము మొదలైనవి వర్ణించబడ్డాయి. ఇతర పురాణలలో అసలులేని విషయాలు, లేక చాలా సంక్షిప్తంగా చెప్పబడిన విషయాలు కొన్ని ఇందులో చెప్పబడ్డాయి. శివుని శరీరంలోని

వివిధ అవయవాలకు అలంకారాలుగా ఉన్న వివిధ సర్పాల పేర్లు ఇందులో చెప్పబడ్డాయి. బదరికాశ్రమంలో నరనారాయణులతో ప్రహ్లాదుని యుద్ధం, దేవాసురుల యుద్ధంలో వారి వేరువేరు వాహనాల వర్ణన, కర్కచతుర్థీ వ్రత కథ, కాయజ్జీవీ వ్రత కథ, గంగామానసిక స్నానం, గంగామాహాత్మ్యం, దధివామన స్తోత్రం ఇవ్వబడ్డాయి. అల్లసాని పెద్దన తన మనుచరిత్రలో ప్రవరుడు ప్రతిరోజు ప్రాతఃకాలంలో దధి వామన స్తోత్రం చేస్తూ స్నానాన్ని వరుణానదీ తీరంలో నిర్వర్తించేవాడని చెప్పబడిన స్తోత్రం ఇదే. ఇలాగే వరాహ మాహాత్మ్యం, వేంకటేశగిరి మాహాత్మ్యం, త్రివిక్రముని చేత జరిగిన దుంధువధ, ప్రహ్లాదుని తీర్థయాత్ర, వామనుని విధి స్వరూపము, వివిధ నివాస స్థానముల వర్ణనలే గాక ఇంకా ప్రహ్లాదుడు తన మనుమడైన బలి చక్రవర్తికి చేసిన విష్ణుభక్తి మహాత్మ్యోపదేశము, విష్ణు పూజావిధి, విష్ణ్వాలయ నిర్మాణ విధానము, వైష్ణవదీక్షలో దీక్షితుడు అగు విధానములతో పురాణము ముగించబడింది.

వర్ష ఋతువులో తీవ్ర వృష్టివలన బాధపడిన పార్వతి శివునితో నాథా మనకు ఒక మంచి ఇంటిని సమకూర్చండి. అందులో మనం సుఖంగా నివాసం చేయగలం. ఈ వర్షబాధ భరించలేకపోతున్నాను అని విన్నవించుకొన్న. ఈ మాటలను విన్న శివుడు పార్వతితో పరిహాసపూర్వకంగా “పార్వతీ నేను శ్మశానసనంలో ఉండేవాడిని, పులితోలు కప్పుకొని శరీర ఆచ్ఛాదన చేసుకొనేవాడిని. నా హారాలు సర్పాలు. అలాంటి నేను ఇంటిని ఎలా సమకూర్చగలను అని అమెతో అన్నాడు. ఈ మాటలు వినిన పార్వతి ఇంకా కోపాన్ని తెచ్చుకొని నాథా! నేను వర్షంలో నానిపోతున్నాను. ఎంత గట్టిగా వర్షం పడుతున్నదో చూడండి. అలాంటప్పుడు నాకు వర్షం నుంచి రక్షణే లేదా అని ప్రశ్నించింది. మీకు ఇల్లు సమకూర్చే ఉద్దేశ్యంలేకపోతే ఇక వేరే మార్గం ఆలోచించండి అన్నది. అందుకు చంద్రమౌళి ప్రతిస్పందిస్తూ, పార్వతీ ఇంటిని నేను సమకూర్చలేను గానీ నీ శరీరాన్ని వర్ష జలం స్పృశించకుండా చేయగలను అని చెప్పి పరమ శివుడు, తాను మేఘాలపై ఆశీనుడై సతీదేవిని ఒక జల బిందువు కూడా స్పృశించటానికి వీలులేదని మేఘాలను ఆదేశించాడు. అప్పటి నుంచి శంకరుని పేరు జీమూతవాహనుడు అయింది అని ఈ పురాణం హృద్యంగా తెలుపుతూ ఋతువులను కావ్యశైలిలో వర్ణించింది.

## వామనపురాణంలో చెప్పబడిన విషయాలు, విశేషాలు

అష్టాదశ మహాపురాణాలలో పద్నాలుగవది ప్రస్తుత వామనపురాణం. శ్రీ మహా విష్ణువు యొక్క అయిదవ అవతారం వామనావతారం. వేదాలలో కూడా ప్రత్యక్షంగా శ్రీ

మహావిష్ణువే వామనావతారం ఎత్తి త్రివిక్రముడైనట్లు వర్ణించబడిన అవతారం వామనావతారం. శ్రీమహావిష్ణువు వామనావతారాన్ని ధరించి బలిచక్రవర్తిని పాతాళ లోకానికి పంపి దేవతలకు సంతోషం కలిగించి ధర్మోద్ధరణచేసి వృత్తాంతాన్ని వివరించిన పురాణం కాబట్టి ఇది వామనపురాణం అయింది. ఆ విధంగా ఇందులో త్రివిక్రముని మహిమ వర్ణించబడింది.

ఈ పురాణం పరమపవిత్రమైనది. పురాణ పురుషుడైన పరమాత్మునికి ఈ పురాణం త్వక్ స్థానాన్ని పొందుతున్నది. త్రివిక్రముడుగా మాయారూపం అవతారం ధరించిన పరమాత్ముని కథతోపాటే నరనారాయణోపాఖ్యానం, జగన్మాత దుర్గాదేవి చరిత్ర, ప్రహ్లాద వృత్తాంతము, శ్రీదాముడు మొదలైన పరమ భక్తుల కథలు మనోహరంగా ఇందులో వర్ణింప బడ్డాయి. ఇందులోని ప్రత్యేకాంశము బలి చక్రవర్తి కథయేగాకుండా మరొక దైత్యరాజు 'ధుంధు'కు సంబంధించిన వేరొక వామనుని అవతార కథ కూడా కనిపిస్తుంది. బహుశ ఆ కథ వేరొక మన్వంతరానికి చెందినది అయి ఉండవచ్చు. అయితే ఆ విషయం ఇందులో స్పష్టంగా పేర్కొనబడలేదు. గజేంద్రమోక్షకథకు మూలం ఈ గ్రంథంలో కనిపిస్తుంది.

ప్రధానంగా విష్ణుపారమ్యమైన పురాణం అయినప్పటికీ ఈ పురాణంలో శైవ శాక్తాది సంప్రదాయాల ప్రతిపాదన కూడా వివరించబడి సర్వత్రా ఒక ఐక్యత కనిపిస్తుంది. శివ కేశవులే కాకుండా దేవి ఆరాధన కూడా ఒకటి కొకటి భేదం కలవి కాదని వివరిస్తుంది. 'సర్వదేవ నమస్కారః కేశవం ప్రతిగచ్ఛతి' అనే సర్వమానవతా సూత్రం కనిపిస్తుంది. అందువలన ఈ పురాణం మత సహనం పూర్తిగా ప్రతిపాదిస్తుంది. వామన పురాణంలోని విషయాలను పరిశీలిస్తే పాశపతశైవ భాగవత వైష్ణవాల చక్కని సమ్మేళనం ఉన్నది. విల్సన్ వంటి విదేశీ పండితుడు కూడా ఇతర పురాణాల కంటే వామన పురాణం హరిహరాదులకు సమాన గౌరవం ఇస్తున్నదని, పక్షపాత రహితమైన సహనం ప్రదర్శిస్తున్నదని, ఏ తెగ, సిద్ధాంతానికి కట్టుబడినది కాదని బహుశః అవి ఏర్పడటానికి ముందే ఈ పురాణ రచన జరిగి ఉంటుందని తెలిపాడు.

మొదట పులస్త్యునికి నారదుని ప్రశ్నతో ప్రారంభమైన ఈ పురాణం నారదునకు వినిపించిన వామనావతార కథ, అనంతరం శివలీలలు, శివుడు జీమూతవాహనుడైన వృత్తాంతం, బ్రహ్మ మస్తక ఖండనం, కపాల మోచన కథ, దక్షయజ్ఞ ధ్వంసము, హరి యొక్క కాల రూపం, కామదహనం, ప్రహ్లాద నారాయణ యుద్ధం, భావన కోశం, దుర్గా చరిత్రం, కురుక్షేత్ర వర్ణన, సత్యామాహాత్మ్యం, పార్వతీ జననం, గౌరీ ఆఖ్యానం, స్కంద చరిత్ర, అంధకాసుర వధ, జాబాలిక కథ, మరుద్గణాల ఉత్పత్తి, బలి చరిత్ర, లక్ష్మీ

చరిత్ర, త్రివిక్రమ వృత్తాంతం, ప్రేతోపాఖ్యానం, నక్షత్ర పురుషాఖ్యానం వంటి అనేక వృత్తాంతాలు హృదయంగమంగా వర్ణించబడ్డాయి. ఆకర్షణగల కావ్యశైలి ఈ పురాణపు ప్రత్యేకత. ఇతర పురాణాలలో కనిపించని కొన్ని విషయాలు ఈ పురాణంలో కనిపిస్తాయి. బదరికాశ్రమంలో నరనారాయణులతో ప్రహ్లాదుడు చేసే యుద్ధం, శక్తికంటే భక్తే మేలైన దనే వృత్తాంతం, శివుడు తన వేర్వేరు అంగాలలో ధరించే సర్పాల పేర్లు, దేవదానవులు ఉపయోగించే వేరువేరు వాహనాల పేర్లు, వాని వర్ణనలు. కర్కాటక చవితి వ్రతం, కాయజ్ఞ వ్రతం, గంగా మానసిక స్నానం, గంగా మాహాత్మ్యం, దధివామన స్తోత్రం, వరాహ మహాత్మ్యం, వేంకటేశగిరి మాహాత్మ్యం, సుకేశిని చరిత్ర, త్రివిక్రముని ద్వారా ధుంధువధ, ప్రహ్లాదుని తీర్థయాత్ర, వామనమూర్తి వివిధ రూపాలు, ఆయన ఉండే వేర్వేరు ప్రదేశాల వర్ణన, మొదలైనవేకాక చివరగా ప్రహ్లాదుడు తను వామనుడైన బలికి చేసే విష్ణుభక్తి మహిమోపదేశం, విష్ణు పూజా విధానం, విష్ణ్వాలయ నిర్మాణం, విష్ణుదీక్షా గ్రహణ విధానం మొదలైన విషయాల వివరణతో ఈ పురాణం పరిసమాప్తి అవుతుంది.

ఈ పురాణం కురుక్షేత్రాన్ని అందులోని తీర్థాలను ప్రధానంగా ప్రశంసిస్తున్నది. సరో మాహాత్మ్యం అధ్యాయాలలో మునిసూత సంవాదం, కురుజాంగలంలో జరుగుతుంది. ఈ పురాణం ప్రకారం బలియజ్ఞం చేసినదీ, అతనిని వామనుడు మోసగించినదీ, కురుక్షేత్రం లోనే పద్మపురాణాన్ని అనుసరించి ఈ కార్యం పుష్కరక్షేత్రంలో జరిగింది. అగ్ని పురాణాన్ని బట్టి గంగాద్వారంలోను, స్కందపురాణ ప్రభాస ఖండాన్ని బట్టి ప్రభాసం చేరువనగల సురాష్ట్రంలోని నిరస్త్రాపథ క్షేత్రంలోను, భాగవతాన్ని బట్టి నర్మదా నదీ తీరాన జరిగింది.

అందుకే వామన పురాణం క్షేత్రాలలో కురుక్షేత్రం లేక కురుజాంగలం తీర్థాలలో పృథూదకము పరమశ్రేష్ఠాలని ప్రకటిస్తుంది.

ఇందులో 12 మహావిష్ణు స్తోత్రాలు, 8 శివస్తోత్రాలు, 4 దేవీ స్తోత్రాలు ఇంకా సుదర్శన స్తోత్రం మొత్తం 25 స్తోత్రాలు ఉన్నాయి. ఆ రకంగా భక్తుల స్తోత్ర తృష్ణను తీర్చగల పురాణం ఇది.

ఇందులో ప్రతి మనుష్యుడు లేవగానే బ్రహ్మ విష్ణు మహేశ్వరులు సూర్యాది నవగ్రహాలు, సప్తఋషులు, సప్తలోకాలు తమకు శుభం చేకూర్చాలని చక్కని శ్లోకాలతో కర్తవ్య బోధ చేయడం కనిపిస్తుంది.

ఆపత్కాలంలో కూడా కొందరిని ఆశ్రయించరాదని హితవు చెబుతున్నది ఈ పురాణం. ఆ కొందరు ఎవరంటే

1. **షండుడు –** సకాలంలో స్నానము, దేవతారాధ చేయనివాడు. తల్లి దండ్రులను గౌరవించనివాడు.
2. **మార్జారుడు –** పుణ్యలోక ప్రాప్తికోసంగాక అహంకారం నిర్లక్ష్యాలతో జపతపాలు చేసేవాడు.
3. **ఆఖువు –** కావలసినంత సంపద ఉన్నా తాను తినక, ఇతరులకు పెట్టనివాడు.
4. **కుక్కుటుడు –** పక్షపాతంతో తీర్పు చెప్పేవాడు.
5. **పతితుడు –** తన ధర్మం వదలి పరధర్మం ఆచరించేవాడు.
6. **అపవిద్ధుడు –** గోహత్య, స్త్రీ హత్య మొదలైన మహాపాతకాలను ఆచరించేవాడు.
7. **నగ్నుడు –** దైవభక్తి లేనివాడు.
8. **చండాలుడు –** ఎంతో ఆశతో వచ్చినవారికి తాను సహాయపడక ఇతరులు కూడా సహాయం చేయకుండా అడ్డుపడేవాడు. మరియు శరణుకోరి వచ్చిన వాణ్ణి గాలికి వదలివేసేవాడు.
9. **అధముడు –** బంధువులు, స్నేహితులు, ఉత్తములు మొదలైన వారందరకీ దూరమైనవాడు.

ఇలాగే మానవుడు ఆచరించాల్సిన సదాచారం 122 శ్లోకాలలో చక్కగా వివరించ బడింది. ఇంకా ఎన్నో విశేషాలు. చెప్పేకొద్దీ తరగని గని.

## వేదాలలో వామనుని ప్రసక్తి

అవతారాలను గురించిన కొంత ప్రసక్తి బీజ రూపంలో వేదాలలో ఉన్నది. ఇంద్రుడు తన మాయతో వివిధ రూపాలను ధరిస్తాడని ఋగ్వేదం చెప్పుతున్నది. (3.53.8, 6.47.18). కొన్ని బ్రాహ్మణాలు ఈ విషయాన్ని పేర్కొంటున్నాయి. శతపథ బ్రాహ్మణం ప్రజాపతి మత్స్య (1.8.1.1) కూర్మ (7.5.1.5, 14.1.2.11), వరాహ (14.1.2.11) అవతారాలు ఎత్తినట్లు తెలుపుతున్నది. అలాగే భగవంతుడు బహురూపాలను ధరించటం తైత్తిరీయ బ్రాహ్మణం (1.1.3.5), కాఠక సంహిత కూడా తెలుపుతున్నది. క్రమంగా ఈ అవతారాలు ఎత్తినవాడు విష్ణుభగవానుడే అని విఖ్యాతపరచబడింది. అయితే ఒక్క వామనావతార విషయంలో మాత్రం అన్ని చోట్ల విష్ణువే ఈ అవతారాలను ఎత్తినట్లుగా తెలుపబడింది. ఋగ్వేదంలో 'విచక్రమాణ స్త్రీ ధోరుగాయషః' – అని 'ఉరుక్రమః' అని విశేషణాలు విష్ణువుకు కూర్చబడ్డాయి. మూడు అడుగులతో ఆయన నేలను కొలవడం చాలా ఘనమైన విషయంగా స్తుతించబడింది.

ఋగ్వేదంలో విష్ణు సూక్తాలనే ప్రత్యేక స్తుతి ఉన్నది. ఆ భాగంలోని అనేక మంత్రాలలో వామనావతారం ధరించడం చాలాసార్లు స్తుతించబడింది. ఋగ్వేదం ప్రథమ మండలం 154 వ సూక్తంలో ఇంతకుముందు తెలిపిన 'విచక్రమాణస్త్రే ధోరుగాయ' అని మూడు అడుగులలో భూమిని కొలిచాడు అని పేర్కొనబడింది. అలాగే 'యదం దీర్ఘం ప్రయత్నం సధస్థమ్, ఏకోవిమమే త్రిభిరత్వదేభిః' (1.154.3) అని, పితరులు నివసించే బహుదూరం వ్యాపించిన దానిని అంతరిక్షాన్ని – విష్ణువు ఒక్కడే మూడు పాదాలతో కొలిచాడు అని చెప్పబడింది. మూడు అడుగులలో మొత్తం భూమిని కొలిచినందునకే ఆయనకు 'ఉరుగాయః' 'ఉరుక్రమః' అన్న విశేషాలు ఉపయోగించబడ్డాయి. ఇంకొక ప్రసిద్ధ మంత్రంలో

**ఇదం విష్ణుర్విచక్రమే, త్రేధానిదధం పరమ్**
**సమూఢ మస్య పాంసురే** *(1.22.17)*

అనీ అనగా మూడు అడుగులలో విష్ణువు జగత్తును ఆక్రమించి తన పాదం ఉంచాడు. ఆయన ధూళి ధూసర పాదంలో భూమ్యాది సమస్త లోకాలు అంతర్హితమైనవి' అని చెప్పబడింది. శతపథ బ్రాహ్మణం విష్ణువును 'వామనోహి విష్ణురాస!' అని అనగా విష్ణువు వామనుడని పేర్కొంటున్నది. కాబట్టి

**త్రీణీ పదావిచక్రమే, విష్ణుర్గోపా ఆదాభ్యః**
**అతో ధర్మాణి ధారయన్.** *(1.22.18)*

అని కథయే కాక పేరు కూడా ఉన్నందున వామనావతార కథ వేదమూలకమైనది అని తెలుస్తున్నది. వేదంలో సూచ్యాత్మకంగా ఉన్న వామన అవతార వృత్తాంతం విస్తృతంగా పురా ణంలో వివరించడం, ఆ అవతార ఉద్దేశ్యం ధర్మోద్ధరణకేనని తెలపడం మొదలైనవాని చేత వామనుని కథావృత్తాంతం ముఖ్యాంశంగా వర్ణించిన వామన పురాణం వేదోపబృంహణం చేస్తున్నదని చెప్పడంలో ఎటువటి ధర్మసందేహం అవసరము లేదు.

ఋగ్వేదంలో భాగమైన శతపథ బ్రాహ్మణంలో వామన కథ ఉన్నది. ఈ కథే పురాణాలలో చెప్పబడిన వామనావతార కథకు మూలం కావచ్చు.

**తా వాంవాస్తూన్యుశ్మసి గమధ్యై**
**యత్ర గావో భూరి శృంగా ఆయాసః**
**అత్రాహ తదురుగాయస్య వృష్ణః**
**పరమం పదమవభాతి భూరి** *(1.154.6)*

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Sri+Vamana+Mahapuranam**

* * *